ప్రజాశక్తి
శుక్రవారం 1 డిసెంబర్ 2023
5
అల్లూరి సీతారామరాజు



త్వరితగతిన రహదారుల నిర్మాణం

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద చేపట్టిన రోడ్ల నిర్మాణాలు త్వరిత గతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ అదనపు కార్యదర్శి, నీతి అయోగ్ ప్రభారి అధికారి ఎం.నాగరాజు సూచించారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పధకాల అమలు తీరును పరిశీలించడానికి జిల్లాకు విచ్చేసిన ఆయన గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూపరిపాలన, రెవెన్యూ, అటవీ శాఖలు సమన్వయంతో పని చేసి రహదారుల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాలన్నారు. గర్భవతులు, బాలింతలకు వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. గిరిజన ప్రాంతాలలో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపరచి గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు దీటుగా పిల్లల విద్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. బడి మానేసిన పిల్లలకు అవగాహన కల్పించి పాఠశాలలకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. సంయుక్త కలెక్టర్ శివ శ్రీనివాసు మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేస్తారన్న ఆశాభావాన్ని వ్యక్త పరిచారు.

పునాది దశలోనే నిలిచిన వంతెన

-రవాణా సౌకర్యం లేక గిరిజనుల అవస్థలు
-పట్టించుకోని అధికారులు



ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని అరకు వారపు సంత బయలు నుంచి కొల్లాపూట్టు రోడ్డుకు ప్రధాన వంతెన గత్తర జిల్లెడ గెడ్డ వద్ద నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను పునాది దశలోనే వదిలేయడంతో ఆ ప్రాంత గిరిజనులు రవాణా సౌకర్యానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుకు ఆనుకొని కొర్రాయి, కొల్లాపూట్టు, పంచాయతీ గ్రామాలతో పాటు ఒడిస్సా రాష్ట్రానికి అనుకొని పలు గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల గిరిజనులకు ఎటువంటి నిత్యావసర సరుకులు కొనుగోలు చేయాలన్నా, వైద్య సేవలు పొందాలన్నా, పండించిన కూరగాయలను విక్రయించాలన్న వారపు సంతల అరకు సంత బయలుతో పాటు అరకులోయ ప్రాంతానికి వచ్చి పనులు చేసుకుంటూ వెళుతుంటారు. ఆ ప్రాంత గిరిజనుల రవాణా సౌకర్యానికి గత్తర జిల్లెడ వంతెన ప్రధానంగా ఉంది. ఈ వంతెన నిర్మాణానికి గత రెండేళ్ల క్రితం నిర్మాణ పనులను ప్రారంభించారు. రాడ్లు వేసి పునాది దశ వరకు నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రెండు ఏళ్ళు గడుస్తున్నా ఇప్పటికీ నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపైన వర్షపు నీరు నిల్వ ఉండి పోతుండటంతో పాటు బురదగా మారుతుంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలంలో ఆ ప్రాంతం గిరిజనులు అనారోగ్యానికి గురైన వెంటనే 108 అంబులెన్సులో వ్యాధిగ్రస్తులను తరలించడానికి వాహనం వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని గిరిజనులు వాపోతున్నారు. ఒడిస్సాకు కనెక్టివిటీగా ఈ రోడ్డు ఉండటంతో నిత్యం ఒడిస్సా నుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. దీనికి తోడు కొల్లాపూట్టు జలకరంగిని పర్యాటక ప్రదేశం ఉండడంతో పర్యాటకులు కూడా నిత్యం రాకపోకలు చేస్తుంటారు. వంతెన లేకపోవడంతో వీరంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాడ్లు వేసి అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన ఈ వంతెనను పూర్తిగా నిర్మించాలని పలుమార్లు ఆ ప్రాంత గిరిజనులు సంబంధిత ఉన్నత స్థాయి అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆ ప్రాంత గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి అసంపూర్తిగా ఉన్న కోర్రాయి పంచాయతీ గత్తర జల్లెడ వంతెనను పూర్తిగా నిర్మించి రవాణా కష్టాలు తీర్చాలని ఆ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

సిహెచ్‌డబ్ల్యుల సమస్యలపై పోరాటం

-ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా పరిధిలో వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న సిహెచ్‌డబ్ల్యులను ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆశ వర్కర్లుగా మార్చాలని, గత ఆరు రోజులుగా పాడేరు ఐటిడి ఎదురుగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం ఏడవ రోజు కొనసాగాయి. ప్రభుత్వం స్పందించి సిహెచ్డబ్ల్యులను ఆశ వర్కర్లుగా మార్చకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, పాడేరు ఏజెన్సీలో ఉన్న 750 మంది ఆశ వర్కర్లు నిరవధిక నిరాహార దీక్షలకు దిగుతామని ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి తెలిపారు. దీక్షా శిబిరానికి గురువారం వచ్చి సంఘీభావం తెలియ చేశారు... ఒకే పని విధానం కలిగివున్న సిహెచ్‌బ్యులను ఆశ వర్కర్లుగా మారుస్తామని ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చిందని ఈ మేరకు కచ్చితంగా మార్చాలన్నారు. సిహెచ్ డబ్ల్యు నెలకు కేవలం రూ.4000 రూపాయలతోటే జీవితం గడపడం అన్నది చాలా దారుణమైన విషయమన్నారు. సిహెచ్డబ్ల్యులను ఆశ వర్కర్లుగా మార్చాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. సిహెచ్ డబ్ల్యు నిరాహార దీక్ష చేస్తుండటంతో గ్రామాల్లో ప్రజానీకానికి వైద్యారోగ సేవలు క్షేత్రస్థాయిలో అందలేదని అధికారులు గమనించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సిహెచ్డబ్ల్యుల పోరాటం సమస్య పరిష్కారం అయ్యే వరకు ఉంటుందని, ఐద్వా తరపున పూర్తి మద్దతు ఉంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన మహిళ సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శిలు జయ, కౌసల్య, హైమా, ఆశ వర్కర్లు మంగమ్మ, కమ్యూనిటి వర్కర్స్ కె.పార్వతమ్మ, కాంతమ్మ, చిన్ని, సావిత్రీ, మొద కొండమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభావతి



ఐటిడిఎ పిఒతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు


4 నెలల్లో రోప్ వే బ్రిడ్జి నిర్మాణం

ప్రజాశక్తి-రంపచోడవరం

మండలంలోని బందమామిడి నుండి రంపచోడవరం వెళ్లే రహదారి మధ్యలో ప్రమాదకరంగా ప్రవహిస్తున్న కాలువపై రోప్ వే బ్రిడ్జి నాలుగు నెలల్లో నిర్మాణం చేస్తామని రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే తెలిపారు. ఈ కాలువ దాటేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గురువారం గ్రామస్తులు ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. వెంటనే వారు స్పందించి రంపచోడవరం ఐటీడీఏ పీవో ఛాంబర్‌కు గ్రామస్తులతో కలిసి వెళ్లి పిఓ సూరజ్ గనోరేకు సమస్యను తెలియజేశారు. సానుకూలంగా స్పందించిన పిఓ నాలుగు నెలల సమయంలో రోప్ వే బ్రిడ్జిని అందుబాటులో తీసుకొస్తామని చెప్పారు.


సిఐలు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- రంపచోడవరం



రంపచోడవరం సిఐగా వెంకటేశ్వరరావు

రంపచోడవరం పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వాసా వెంకటేశ్వరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మచిలీపట్నంలో ఎస్సైగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. గతంలో విజయవాడ హనుమాన్ జంక్షన్, పూచికుంటలలో ఎస్సైగా పని చేశారు. ఎస్సై మోహన్ కుమార్ స్టేషన్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలో శాంతి భద్రతలకు ప్రాధాన్యత ఇస్తానని, అసాంఘిక కార్యక్రమాల నివారణకు కృషి చేస్తానని సిఐ తెలిపారు.



మారేడుమిల్లి సిఐగా భీమరాజు

మారేడుమిల్లి : మారేడుమిల్లి పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రుద్రరాజు భీమరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఏలూరు రేంజ్ నుండి మారేడుమిల్లి సిఐగా బదిలీపై వచ్చారు. మారేడుమిల్లి సిఐగా పనిచేసిన రమేష్‌ను విఆర్‌కు పంపించినట్లు సమాచారం.

3న సివిల్స్, గ్రూప్స్ శిక్షణకు రెండో దశ అర్హత పరీక్ష

ప్రజాశక్తి -చింతూరు

సివిల్ సర్వీసెస్, గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలు పొందేందుకు ఉచిత శిక్షణ నిమిత్తం రెండో దశ అర్హత పరీక్ష డిసెంబర్ 3న రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి దశ పరీక్షలో క్వాలిఫై అయిన వారికి రెండో దశ పరీక్షలు నిర్వహిస్తున్నామని, దీనికి చింతూరు ఐటిడిఎ కార్యాలయంలో హాల్ టికెట్లు ఈనెల 1 నుండి జారీ చేస్తున్నామని, అభ్యర్థులు తీసుకోవాలని కోరారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు 3న ఉదయం 9 గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో రిపోర్టింగ్ చేయాలని పేర్కొన్నారు. ఏదైనా గుర్తింపు కార్డు, బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తప్పనిసరిగా తీసుకొని పరీక్షకు హాజరు కావాలని ప్రాజెక్ట్ అధికారి సూచించారు.



రహదారి వివరాలు తెలుసుకుంటున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

మారుమూల గ్రామాలకు రహదారులు

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు రహదారులు ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. రంపచోడవరం మండలం టి.బూరుగుబంద, బివి కోట గ్రామాలకు సంబంధించిన రోడ్డు పనులను గురువారం ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టి.బూరుగుబంద గ్రామం నుండి బీవీ కోట గ్రామం వరకు ఎన్‌ఆర్ఇజిఎస్ నిధులు రూ.3.50 కోట్లతో 7.5 కిలోమీటర్లు మేరకు బిటి రోడ్డు పనులు జరుగుతున్నట్లు చెప్పారు. పిఓ వెంట గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చైతన్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎంవివి సత్యనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ పున్నయ్య తదితరులున్నారు.

ఎఎస్ఎస్.కామేశ్వరరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-రంపచోడవరం

విద్యుత్ ఉద్యోగుల శ్రేయస్సు కొరకు ఆత్మార్పణ చేసుకున్న అమరజీవి కార్మిక రత్న ఎఎస్ఎస్ కామేశ్వరరావు 50వ వర్థంతి సందర్భంగా రంపచోడవరం డివిజన్ కార్యాలయంలో గురువారం విద్యుత్ శాఖ సిబ్బంది కామేశ్వరరావు చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యమ్‌డి.యూసఫ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.మల్లిఖార్జునరావు, ఎఇలు శ్రీనివాస్, కిరణ్, జెఇలు సోమరాజు, శ్రీనివాస్, లైన్ ఇన్‌స్పెక్టర్లు కెవి.రమణ, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



కామేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది



మాట్లాడుతున్న పాల్గుణ

బస్సు యాత్రను విజయవంతం చేయండి ఎమ్మెల్యే పాల్గుణ

ప్రజాశక్తి- అరకులోయ : ఈనెల 12న అరకు నియోజకవర్గం పరిధిలోని హుక్కుంపేట మండలం కేంద్రంలో జరిగే సామాజిక సాధికార బస్ యాత్రను విజయవంతం చేయాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం గిరిజనుల కోసం ప్రత్యేక పథకాలు రూపొందించి ఈ ప్రాంత అభివృద్ధికి తీవ్రంగా కృషి చేసిందన్నారు. ఈ బస్సు యాత్రలో వైసిపి ముఖ్య నేతలు పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గంలోని జడ్పిటిసిలు, ఎంపీపీలు, ఎంపిటిసిలు, సర్పంచులు, సీనియర్ నాయకులు, కన్వీనర్లు, ఈ యాత్రకు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాల్గుణ కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శెట్టి అప్పాలు, రామ్మూర్తి, సాంబయ్య, శ్రీను, రామన్న, గోపాల్, శెట్టి వెంకటరావు, పి.సంపత్, దురియ, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.



క్రీడా సామగ్రిని అందజేస్తున్న ఎంపిపి

క్రీడా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని 21 సచివాలయాలకు ఆడుదాం ఆంధ్ర స్పోర్ట్స్ కిట్లను ఎంపీపీ శెట్టి నీలవేణి గురువారం పంపిణీ చేశారు. డిసెంబర్ 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న అడుగుదాం ఆంధ్ర క్రీడా సంగ్రామానికి సంబంధించిన కిట్లు మండలానికి చేరుకోగా వాటిని మండల పరిధిలోని సచివాలయాలకు అందజేశారు. మండల కేంద్రానికి మూడు, ప్రతి సచివాలయానికి ఒక్కొక్క కిట్లు అందించారు. ఒక క్రికెట్ కిట్ షటిల్ బ్యాట్మెంటన్ టెన్నికాయిట్, వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, శ్రీహర్షిత్ రాజాం, ఏవో లక్ష్మీనారాయణ, సీనియర్ అసిస్టెంట్ రామచంద్రరావు, జూనియర్ అసిస్టెంట్ రాజమ్మ, కోఆప్షన్ సభ్యుడు షేక్ మదీనా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు స్పందన రద్దు

ప్రజాశక్తి- పాడేరు: ప్రతి శుక్రవారం జిల్లాలో జరగనున్న జగనన్నకు చెబుదాం స్పందన ప్రత్యేక కార్యక్రమం డిసెంబర్ ఒకటవ తేదీ శుక్రవారం కొన్ని పరిపాలనా కారణాలతో రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయం గమనించి స్పందనకు హాజరు కారాదని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.


కోతుల కోసం అమర్చిన వలలో చిక్కిన చిరుత

రక్షించే క్రమంలో మృత్యువాత

ప్రజాశక్తి - అడ్డతీగల

అడ్డతీగల మండలం ఎల్లవరం పంచాయతీ పరిధి ఎల్లవరం గ్రామ శివారు ప్రాంతంలో కోతులు కోసం రైతులు అమర్చిన వలలో చిరుత పుల్లి చిక్కింది. అయితే దానిని అటవీశాఖ అధికారులు రక్షించే ప్రయత్నం చేయగా, మృతి చెందింది. అధికారులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... ఎల్లవరం గ్రామ శివారు ప్రాంతంలో గురువారం ఉదయం రైతులు పొలంలోకి వెళ్తూ చెట్టుకు చిక్కి వేలాడుతున్న చిరుత పులిని చూసి భయబ్రాంతులకు గురై గ్రామంలోకి పరుగులు తీశారు. ఊరిలో అందరికీ చెప్పగా వారంతా వచ్చి పరిశీలించగా, పులి వలలో చిక్కుకుందని గుర్తించారు. వెంటనే ఫారెస్ట్ అధికారులకు తెలియజేయగా, అటవీ రేంజర్, సిబ్బంది, ఎస్సై అప్పలరాజు, పోలీసు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో విశాఖపట్నం నుండి అధికారులను రప్పించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్టర్ సహాయంతో చిరుత పులికి బకెట్లో నీళ్లు పెట్టి తాగించారు. అనంతరం దానిని నెమ్మదిగా వలతో సహా బయటకు తెచ్చి బోనులోకి పంపించారు. వెటర్నరీ డాక్టర్ వైద్య సేవలు అందించారు. అయితే గురువారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో పరిస్థితి విషమించి చిరుత పులి మృతి చెందినట్లు అధికారులు ధ్రువీకరించారు. దీంతో చిరుత మృతదేహానికి పంచనామ నిర్వహించి, దహనం చేశారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం డిఎఫ్ఓ జిజి.నరేంద్రన్, అడ్డతీగల సబ్ డిఎఫ్ఓ రామారావు, అటవీశాఖ అధికారులు ఎస్‌కె.ఆజాద్, దుర్గకుమార్‌బాబు, ఎం.అబ్బాయిదొర, అడ్డతీగల తహశీల్దారు తాతారావు, ఎస్ఐ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.






వలలో చిక్కుకొని చెట్టుకు వేలాడుతున్న చిరుత, ట్రాక్టర్‌పై బకెట్‌తో నీళ్లు పెడితే తాగుతున్న దృశ్యం, బోనులో బంధించిన, చిరుతను చనిపోయిన తరువాత పరిశీలిస్తున్న వైద్యులు, అటవీశాఖ అధికారులు

సమ్మె నోటీసులు అందజేసిన అంగన్వాడీలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాలంటూ ఈనెల 8న అంగన్వాడీలు సమ్మెకు వెళుతున్న నేపథ్యంలో సమ్మెకు సంబంధించిన నోటీసులను మండలంలోని అంగన్వాడీ వర్కర్లు గురువారం ప్రజాప్రతినిధులకు, సచివాలయ సిబ్బందికి అందజేశారు, ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు వెంకటలక్ష్మి మాట్లాడుతూ, అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలని కోరారు. పై డిమాండ్లపై డిసెంబర్ 8 నుండి చేపట్టే నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, లోదొడ్డి సర్పంచ్ లోతా రామారావు మాట్లాడుతూ, అంగన్వాడీల సమస్యలపై అనేక రూపాల్లో ఆందోళన చేస్తే పోలీసుల చేత నిర్బంధం విధించడం, అక్రమ అరెస్టులు చేయడం వంటి చర్యలకు పాల్పడుతుందని తెలిపారు. ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు గిరిజన సంఘం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్వాడి యూనియన్ నాయకులు, అంగన్వాడి వర్కర్లు,హెల్పర్లు,మినీ వర్కర్లు పాల్గొన్నారు.



లోదొడ్డి సర్పంచ్ లోతా రామారావుకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు


తీరంలో శత్రువులను మట్టుబెడుతున్న నేవీ సిబ్బంది

తీరంలో కొనసాగుతున్న నేవీ విన్యాసాలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నేవీ డే వేడుకల్లో భాగంగా గురువారం సాయంత్రం ఆర్.కె.బీచ్ వద్ద నావికాదళ విన్యాసాలను నేవీ సిబ్బంది కొనసాగించారు. తూర్పు నావికాదళానికి చెందిన యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు యుద్ధనౌకలు, సబ్ మెరైన్లు విన్యాసాల్లో పాల్గొన్నాయి. ఈ విన్యాసాలు బీచ్ రోడ్డులోని సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ నెల 4వ తేదీ నేవీ డే సందర్భంగా ఫైనల్ విన్యాసాలు నిర్వహించనున్నామని నేవీ అధికారులు తెలిపారు.

పటిష్ట భద్రతా ఏర్పాట్లు

బీచ్ రోడ్డులో ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్న నేవీ డే వేడుకలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులు, నావికా దళ ప్రధాన అధికారులు హాజరు కానున్న నేపథ్యంలో పోలీస్ పహారా పెంచారు. ఈ కార్యక్రమాలను పలువురు నేవీ అధికారులతో పాటు జివిఎంసి కమిషనర్ సమీక్షించారు.

ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యాన వినతి

ప్రజాశక్తి పాడేరు: ఆర్టీసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని ఏపీఎస్ఆర్టీసీ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ వి.తులసి రామ్ కోరారు. పాడేరు ఆర్టీసీ గ్యారేజ్‌లో వివిధ విభాగాలలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలపై ఆర్టీసీ డిపో ప్రజా రవాణా సంస్థ అధికారికి సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్‌తో కలిసి వినతి పత్రం అందజేశారు. అంతకుముందు ఆర్టీసీ కార్మికులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రామ్ మాట్లాడుతూ, కార్మికులందరికీ సర్క్యులర్ ప్రకారం జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల 5వ తేదీ లోపు జీతాలు ఇవ్వాలన్నారు. ఈఎస్ఐ సౌకర్యం కార్మికులందరికీ అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్మికులందరికీ సెలవు దినాలు అమలు చేయాలన్నారు. గత నెల జీతం బ్యాంక్ స్టేట్మెంట్ సమర్పించిన తర్వాతనే కాంట్రాక్టు బిల్లులు ఆమోదించాలని కోరారు. ప్రతి ఆరు నెలలకు వచ్చే సర్క్యులర్ కాపీని నోటీసు బోర్డు ద్వారా కార్మికులకు తెలియజేయాలన్నారు. గ్యారేజీ పని విషయంలో పర్మినెంట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు తేడాలు చూడరాదని కోరారు. డిపోలో పని చేస్తున్న స్లీపర్లకు నెలకు 500 ఇచ్చి బ్లీచింగ్, చీపుర్లు, సున్నం వంటివి కొనుగోలు చేయాలని ఆదేశించడ అర్థరహితమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎల్.సుందరరావు పాల్గొన్నారు.



ఆర్‌టిసి అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిఐ సత్యనారాయణకు సత్కారం

ప్రజాశక్తి- జి.మాడుగుల: స్థానిక పోలీస్ స్టేషన్లో రెండు సంవత్సరాలుగా సీఐగా విధులు నిర్వహించిన సత్యనారాయణ ఇటీవల బదిలీ అయ్యారు. గురువారం పోలీస్ సిబ్బంది ఆయనకు సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. నూతన సీఐగా ఎస్.రమేష్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పోలీస్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఇదే స్టేషన్ నుంచి బదిలీపై వెళుతున్న అప్పలరాజు, శ్రీను, అప్పారావు, ప్రసాదు, మహేష్, శివ, కిరణ్ అనకాపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు.స్థానిక ఎస్సై శ్రీనివాస్‌రావు ఘనంగా సన్మానించారు

ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-భువనేశ్వర్ మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : 06073 డాక్టర్ ఏంజిఆర్ చెన్నై సెంట్రల్ - భువనేశ్వర్ స్పెషల్ డిసెంబర్ 4 నుంచి జనవరి 29వ తేదీ వరకు ప్రతి సోమవారం రాత్రి 23.45 గంటలకు ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ నుంచి బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 11:15 గంటలకు దువ్వాడ, సాయంత్రం 18.30 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. 06074 భువనేశ్వర్ - డాక్టర్ ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ స్పెషల్ భువనేశ్వర్ డిసెంబర్ 5 నుంచి జనవరి 30వ తేదీ వరకు ప్రతి మంగళవారమూ రాత్రి 21.00 గంటలకు భువనేశ్వర్ నుంచి బయలుదేరి, మరుసటి రోజు తెల్లవారు జామున 3:45 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 15.00 గంటలకు డాక్టర్ ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. ఈ రైళ్ళు గూడూరు, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, విజయనగరం, పలాస, ఖుర్దా రోడ్డు మీదుగా ప్రయాణిస్తాయి.

సంబల్పూర్ - ఈరోడ్ సేవల పొడిగింపు

08311 సంబల్‌పూర్-ఈరోడ్ వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 6 నుంచి 2024 ఫిబ్రవరి 28 వరకు ప్రతి బుధవారమూ ఉదయం 10:55 గంటలకు సంబల్పూర్‌లో బయలుదేరి అదే రోజు రాత్రి 20:45 గంటలకు దువ్వాడ, మరుసటిరోజు 19.50 గంటలకు ఈరోడ్ చేరుకుంటుంది. 08312 ఈరోడ్ - సంబల్‌పూర్ వీక్లీ స్పెషల్ రైలు ఈ నెల 8 నుంచి 2024 మార్చి 1వ తేదీ వరకు ప్రతి శుక్రవారమూ మధ్యాహ్నం 13:45 గంటలకు ఈరోడ్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12:08 గంటలకు దువ్వాడ, అదేరోజు రాత్రి 21:15 గంటలకు సంబల్పూర్ చేరుకుంటుంది. ఈ రైళ్లు బార్‌గఢ్ రోడ్, బలంగీర్, టిట్లాఘఢ్, కేసింగ, మునిగూడ, రాయగడ, పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం జంక్షన్, కొత్తవలస, దువ్వాడ, అనకాపల్లి, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, పెరంబూర్ కాట్పాడి, జోలార్‌పేట, సేలం మీదుగా ప్రయాణిస్తాయి.

సచివాలయాలతో మెరుగైన పాలన : ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి- చింతపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సాయాన్ని కచ్చితంగా తాము ఇస్తున్నామని చెబుతామని అబద్ధాలు చెప్పే పరిస్థితి వైఎస్ఆర్సిపి ప్రభుత్వానికి లేదని పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. కేంద్రం, రాష్ట్రం సంయుక్తంగా ఏదైనా పథకం అమలు చేస్తే కచ్చితంగా రెండు ప్రభుత్వాలు కలిసి చేస్తున్నాయన్నారు. చింతపల్లి మండలం లంబసింగి, కొత్తపాలెం-1 కొత్తపాలెం-2 గ్రామ సచివాలయాలను భాగ్యలక్ష్మి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాడేరు నియోజకవర్గంలో 97 గ్రామ సచివాలయాలకు గాను 70కి పైగా ప్రారంభోత్సవాలు జరిగాయన్నారు. అన్ని సర్వీసులు సచివాలయంలో జరగడం చాలా సంతోషదాయకమని పేర్కొన్నారు. లంబసింగి పంచాయతీలో 27 గ్రామాల ప్రజలకు రూ.15.74 కోట్ల రూపాయలను ప్రభుత్వం జమ చేయడం జరిగిందన్నారు. పేదవారి కోసం ఒక పంచాయతీలో ఇన్ని కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. రాజుబంద తోటరాజు బందలో రూ.20 లక్షలతో రోడ్డు, డ్రైనేజి నిర్మాణానికి నిధులు కేటాయించడం జరిగిందని చెప్పారు. మరో రూ.20 లక్షలు గడప గడపకు మన ప్రభుత్వం నిధులు విడుదల చేయనున్నారని చెప్పారు. లంబసింగి పంచాయతీ పరిధిలో మోదకొండమ్మ గుడి దగ్గర కూడా ఒక వ్యూ పాయింట్ నిర్మాణానికి పార్లమెంటు సభ్యులు నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. పాలంబంధం నుంచి రామన్నపాలెంకు రూ.80 లక్షలతో బీటీ రోడ్డు వేసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లంబసింగి సర్పంచ్ కొర్ర శాంతకుమారి, కొర్ర రఘునాథ్, ఎంపిటిసి రావుల నాగమణి, నూకరాజు, జడ్పిటిసి పోతురాజు బాలయ్య పడాల్, ఎంపీపీ కోరాబు అనూష దేవి, వైస్ ఎంపీపీ సాగిన వెంగళరావు, మండలాధ్యక్షులు మోరి రవి, సర్పంచ్ ఫోరం అధ్యక్షులు దురియా పుష్పలత, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా, డిసిసిబి డైరెక్టర్ కిముడు సీతారామరాజు పాల్గొన్నారు

తప్పని డోలీ కష్టాలు


డోలీతో తరలిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి- అనంతగిరి: మారుమూల గిరిజన గ్రామాలకు కనీస రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు అనారోగ్యాలకు గురైనప్పుడు డోలీమోత తప్పడం లేదు. దీంతో సకాలంలో సరైన వైద్య సేవలు గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందక మృత్యువాతకు గురవుతున్న ఘటనలు నిరంతరం పల్లెల్లో చోటు చేసుకుంటున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కోత్తూరు పంచాయతీ పరిధి బూసుపాడు గ్రామంలోని పట్టం సన్యాసమ్మ తీవ్ర అనారోగ్యానికి గురైంది. కుటుంబ సభ్యులు గురువారం స్వగ్రామం నుండి సుమారు 4 కిలోమీటర్ల దూరం కొండ కోనల నడుమ నుండి గుమ్మ పంచాయతీ కరకవలసకు తరలించారు. అక్కడ నుండి ఆటోలో ఎస్ కోట ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉందని తెలపడంతో మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

అధునాతనంగా పార్కుల అభివృద్ధి

జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ నగరంలోని పార్కులను అభివృద్ధి పరిచి అధునాతనంగా, సుందరంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ తెలిపారు. జోన్-3లోని శివాజీ పార్క్, ఎంవిపి సెక్టార్ 11లో బృందావన్ పార్కుల అభివృద్ధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శివాజీ పార్కులో వాకింగ్ ట్రాక్‌ను, వాటర్ ఫౌంటెన్, జిమ్, యోగా ప్రదేశాలను, చిల్డ్రన్ ప్లే ఏరియా, టాయిలెట్స్ ఇతర మరమ్మత్తు పనులను పరిశీలించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం పార్కును పరిశుభ్ర పరిచేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. క్యాంటీన్ మరమత్తులు పనులు త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలనిన్నారు. పార్కు వెలుపల ఖాళీ స్థలాన్ని పరిశీలించి సందర్శకులు వాహనాలను పార్కు చేసుకునేలా ఏర్పాటు చేయాలని సూచించారు. పార్కులోని అన్ని పనులు త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని పర్యవేక్షక ఇంజినీరు సత్యనారాయణ రాజును ఆదేశించారు. అనంతరం ఎంవిపి కాలనీ సెక్టర్ 11లో సుందరంగా తీర్చిదిద్దిన బృందావనం పార్కును పరిశీలించారు. గోడలకు పెయింటింగ్ పనులు పూర్తి చేయాలని, ఎక్కువగా నీడనిచ్చే మొక్కలను వేయాలని పర్యవేక్షక ఇంజినీరు సత్యనారాయణ రాజు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ ఎం.దామోదరావును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇఇ రత్నాకర్‌రెడ్డి, ఎఎంహెచ్ఒ సిహెచ్.సత్యనారాయణ, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు శ్రీనివాస్, ఎఇ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చందాలతో నగదు అందజేత

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని పెదగరువు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సిఆర్పి, ఎంఐఎస్ కోఆర్డినేటర్, డేటా ఆపరేటర్లకు నాలుగు నెలల నుండి జీతం లేక పోవడంతో అవస్థలు పడుతున్నారు. పెదగరువు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో పని చేస్తున్న ఉపాధ్యాయులు మానవత దృక్పథంతో అందరూ కలిసి చందా వేసుకొని గురువారం మండల విద్యాశాఖ అధికారి కొడా ఈశ్వరరావు ఆధ్వర్యంలో కొంత సొమ్మును సిఆర్పి ఎంఐఎస్ కోఆర్డినేటర్, డేటా ఆపరేటర్‌కి అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు


నగదు ఇస్తున్న ఉపాధ్యాయులు

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంలో వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా డాక్టరు విశ్వేశ్వర్‌నాయుడు ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై గురువారం కొవ్వొత్తులతో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విశ్వేశ్వర్‌రావునాయుడు మాట్లాడుతూ,.ప్రజలు ఎయిడ్స్ బారిన పడకుండా ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను, చికిత్సలను పొందాలన్నారు. ప్రజలు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. వ్యాధి బారిన పడకుండా ముందుగానే తగు చర్యలు తీసుకుంటే ఆరోగ్యం బాగుంటుందన్నారు. ఈ వ్యాధిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన సూచించారు. హెచ్ఐవి అంటు వ్యాధి కాదని, ఏఆర్టి మందులు వాడండి జీవిత కాలం పెంపొందించుకోండి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో శెట్టి నాగరాజు, లక్ష్మణరావు, రమణ, ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఉద్యోగులు, మినుములూరు ఆరోగ్య కేంద్రం ఉద్యోగులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

'భవిష్యత్తు గ్యారెంటీ'పై ప్రచారం


రేవళ్లులోప్రచారం చేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని రేవళ్ళు పంచాయితీలో టిడిపి బూత్ ఇంచార్జ్ మట్టపర్తి అప్పలస్వామి, సర్పంచ్ జనుమూరు వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం బాబు షూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి మినీ మేనిఫెస్టోలో అంశాలు గురించి ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి కురుజు శ్రీనుబాబు, స్వామి, కోసురు లక్ష్మణరావు, గండేపల్లి చిన్ని, రమణ, నాని తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ లబ్ధి


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి - కొయ్యూరు : రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని ఎంపిపి బడుగు రమేష్ అన్నారు. వై నీడ్స్ ఎపి జగన్ అనే కార్యక్రమంలో మండల కేంద్రం కొయ్యూరు గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం ఎంపిపి రమేష్, వైసిపి మండలం అధ్యక్షులు జల్లి బాబులు, జెసిఎస్ కన్వీనర్ సుధాకర్, పిఎసిఎస్ చైర్మన్ సూరిబాబు తదితరులు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి ప్రజల్లో మంచి ఆదరణ ఉందని చెప్పారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ఎమ్మెల్యే, అధికారులు నిరంతరం గ్రామాలలో పర్యటించి సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలిపారు. అనంతరం వైసిపి జెండా ఆవిష్కరించారు. పథకాలకు సంబంధించిన కిట్లు గృహసారథులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సత్యారావు, నరసింగరావు, లాలం శేఖర్, కంతారం ఉప సర్పంచ్ వనంబాబు, వార్డు మెంబర్లు, సచివాలయం కార్యదర్శి, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

గదబపాలెంలో...

మండలంలోని చిట్టెంపాడు సచివాలయం పరిధి గదబపాలెంలో ఎంపిటిసి ఆధ్వర్యాన పల్లెకు పోదాం, వై నీడ్స్ ఎపి జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి వైసిపి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డౌనూరు ఎంపిటిసి బిడిజన అప్పారావు, వైసిపి నాయకులు నీలాపు సూరిబాబు, పెట్ల గాంధీ, నీలాపు లక్ష్మీ, పండు, ఉల్లి రామ్మూర్తి, వాలంటీర్లు కె.మల్లేష్, సరస్వతి, గృహ సారథులు కె.నాగమణి, కె.సీత పాల్గొన్నారు.

అంకితభావంతోనే వైద్య వృత్తిలో రాణింపు


'వైట్‌కోట్' ధారణలో గీతం వైద్య విద్యార్థులు

ప్రజాశక్తి- మధురవాడ : వైద్యవృత్తిలో రాణించాలంటే అంకితభావంతోపాటు సామాజిక బాధ్యత అవసరమనిప్రముఖ వైద్య నిపుణులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎస్.ఆదినారాయణరావు, డాక్టర్ శశిప్రభ సూచించారు. గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) వైద్య కళాశాలలో 2023 బ్యాచ్ నూతన ఎంబిబిఎస్ విద్యార్థులకు 'వైట్‌కోట్ ధారణ' కార్యక్రమంలో మాట్లాడుతూ, డాక్టర్ ఎంవివిఎస్. మూర్తి కలల రూపంగా గీతం వైద్య కళాశాల ఆసుపత్రి ఎదుగుతూ, దేశానికి ఎందరో వైద్య నిపుణులను అందిస్తోందని అభినందించారు. జిమ్సర్ ప్రో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ వైద్య విద్యార్థులు తెల్లకోటు ప్రాధాన్యతను అర్థం చేసుకొని విలువలతో వృత్తిలో ఎదగాలన్నారు. జిమ్సర్ వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు మాట్లాడుతూ దేశంలోని 19 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ప్రస్తుత విద్యాసంవత్సరంలో గీతం వైద్య కళాశాలలో ప్రవేశం పొందారన్నారు. ఈ ఏడాది నూతనంగా ప్రారంభించిన ప్రతిభ స్కాలర్‌షిప్‌లను 40 శాతం మంది విద్యార్థులు ఉపయోగించుకున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా నూతనంగా ప్రవేశం పొందిన వైద్య విద్యార్థులకు డాక్టర్ ఎస్.ఆదినారాయణరావు, డాక్టర్ శశిప్రభ తెల్లకోటులను అందజేశారు. అనంతరం వైద్యవృత్తి పట్ల నిబద్ధతతో, విలువలతో వ్యవహరిస్తామని వైద్య విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ఎన్.ధనలక్ష్మి గురువారం పాల్గొన్నారు. వన విహారి సీబీఈటి ఎకో టూరిజం సమీపంలో నూతనంగా నిర్మించిన బ్యాంబు రెస్టారెంట్‌ను వైసిపి మహిళా నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రారంభించారు. అనంతరం తహశీల్దారు కార్యాలయంలో అసైన్మెంట్ ల్యాండ్ లబ్ధిదారులకు 20 మందికి పట్టాలు పంపిణీ చేశారు. మండలంలోని పాములూరు పంచాయతీ పరిధి మర్రివాడ నుండి ఎల్లివాడ గ్రామానికి రూ.4 కోట్ల 40 లక్షలతో సుమారు 9 కిలోమీటర్లు డబ్ల్యుబిఎం రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, ఎంపీపీ సార్ల లలిత కుమారి, జెడ్పిటిసి బాలాజీ బాబు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువకులకు వాలీబాల్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి రంపచోడవరం : మండలం వెట్టి చెలకలు, దబ్బవలస గ్రామాలలో వాలీబాల్ ఆడే యువతకు ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి గురువారం వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి మారుమూల గ్రామాలలో క్రికెట్, వాలీబాల్ వంటి క్రీడలపై ఆశక్తి ఉన్న యువకులు, వారి దగ్గర డబ్బులు లేక కిట్లు స్వయంగా కొనుక్కోలేక ఆటకు దూరమువుతున్నారని పేర్కొన్నారు.

నాటుసారాతో జీవితాలు నాశనం

ప్రజాశక్తి- కొయ్యూరు : నాటు సారా వల్ల పలువురి జీవితాలు నాశనమవుతున్నాయని, నాటుసారా తయారీ, క్రయ, విక్రయాలకు దూరంగా ఉండాలని కొయ్యూరు సీఐ ఎ.స్వామినాయుడు సూచించారు. మండలంలోని శరభన్నపాలెం గ్రామంలో మంప ఎస్సై లోకేష్ కుమార్‌తో కలిసి గురువారం ఆయన పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమై నాటుసారా తాగడం వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. నాటుసారా మహమ్మారి నిర్మూలనకు గ్రామ వాలంటీర్లు సహకరించాలని కోరారు.

మాజీ సర్పంచ్ తులసీదాస్ మృత్యువాత


మాజీ సర్పంచ్ తులసీదాస్

ప్రజాశక్తి-సీలేరు : జికె.వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధి కొంగపాకల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తులసీదాస్ అనారోగ్యంతో గురువారం ఉదయం మృతి చెందారు. తులసీదాస్ 1993లో కాంగ్రెస్ పార్టీ నుంచి సర్పంచిగా పోటీ చేసి ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా దుప్పిలివాడ మాజీ సర్పంచ్ అలంకి రాజు, కాంగ్రెస్ నాయకులు మల్లు దొర, రాంబాబు, గెన్ను తులసీదాస్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తులసీదాస్ పంచాయతీ అభివృద్ధికి ఎంతో పాటు పడ్డారని తెలిపారు. ఆయన మృతి గ్రామస్తులకు, వారి కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. తులసీదాస్ అంతిమయాత్రలో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

13న జిసిసి బ్రాంచి పాలకవర్గ సభ్యుల ఎన్నిక

ప్రజాశక్తి -కొయ్యూరు : గిరిజన సహకార సంస్థ (జిసిసి) కొయ్యూరు బ్రాంచి పాలక వర్గ సభ్యుల ఎన్నికలు డిసెంబర్ 13న నిర్వహిస్తున్నట్లు జిసిసి అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు మండలంలోని 23 గ్రామ సచివాలయాల వద్ద అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

బ్రాంచి పరిధిలో 298 మంది సభ్యులు ఉన్నారని, డిసెంబర్ 4వ తేదీన నామినేషన్లు స్వీకరిస్తారని, 5న పరిశీలన, 6న ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. 13వ తేదీన ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎన్నికలు జరగనున్నట్లు వెల్లడించారు.

ప్రాణాంతక వ్యాధులకు జన్యు చికిత్స

గీతంలో ప్రముఖ శాస్త్రవేత్త సురజిత్ సిన్హా


అవగాహన కల్పిస్తున్న సురజిత్ సిన్హా

ప్రజాశక్తి- మధురవాడ : కేన్సర్‌తో పాటు ప్రాణాంతక స్పైనల్ మస్క్యులర్ ఆట్రోపి (ఎస్ఎంఎ) వంటి వ్యాధులకు జన్యు చికిత్స ద్వారానే అడ్డుకట్ట పడుతుందని ఇండియన్ అసోషియేషన్ ఫర్ ద కల్టివేషన్ ఆఫ్ సైన్స్ పరిశోధకుడు, కలకత్తాలోని జాదోపూర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సురజిత్ సిన్హా అన్నారు. గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ ఫార్మశీలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ, మానవుల్లో జన్యువుల లోపాల వల్ల సంభవించే వ్యాధులను జన్యు చికిత్స ద్వారానే మొదటి దశలో అంతం చేయాలని, లేదంటే అవి జీవితాంతం ఇబ్బందిపెడతాయన్నారు. స్పైనల్ మస్క్యులర్ ఆట్రోపి (ఎస్ఎంఎ) వంటి జన్యుపరమైన వ్యాధి సంభవిస్తే వెన్నెముక కండరాలు క్షీణిస్తాయన్నారు. మానవ జన్యువులోని డైస్ట్రోఫిన్ అనే జన్యువు కారణంగా సంభవించే ఈ వ్యాధి వల్ల శరీరంలోని నరాలు, కండరాలు చచ్చుబడతాయన్నారుబాలలలో సంభవించే ఈ జన్యు వ్యాధి చికిత్సకు ఏడాదికి రూ.30 కోట్ల వరకు ఖర్చు అవుతుందన్నారు. ఇలాంటి వ్యాధుల చికిత్సకు తక్కువ ధరలో మనదేశంలోనే మందులు లభించేలా తాము పరిశోధనలు చేస్తున్నట్లు వెల్లడించారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ జగత్‌చరణ్‌దాస్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రాజా పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మోతుగూడెం : చింతూరు మండలం, మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధి, పొల్లూరు గ్రామంలో గుర్తు తెలియని సాధువు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... సుమారు 60-65 సంవత్సరాలు వయసు ఉన్న కాషాయ వస్త్రాలు ధరించిన సాధువు భిక్షం ఎత్తుకుంటూ వారం రోజులు క్రితం పొల్లూరు గ్రామానికి వచ్చారు. పొల్లూరు నది కాలువ వద్ద సదరు సాధువు మృతి చెంది ఉండటాన్ని గురువారం గ్రామస్తులు గమనించి, స్థానిక విఆర్ఓకు సమాచారం ఇచ్చారు. విఆర్ఒ మోతుగూడెం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐకు ఫిర్యాదు చేయగా, పోలీసులు సంఘటన స్థలానికి చేసుకున్న పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుని బంధువులు ఎవరైనా ఉంటే మోతుగూడెం పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

ఎయిడ్స్‌కు వ్యతిరేకంగా సమిష్టి పోరాటం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి- సీతమ్మధార : హెచ్ఐవి, ఎయిడ్స్‌కు వ్యతిరేకంగా అందరం పోరాడుదామని డిఎంహెచ్ఒ డాక్టర్ పి జగదీశ్వరరావు పిలుపునిచ్చారు. డిసెంబర్ 1న శుక్రవారం 35వ ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో విలేకర్లుతో మాట్లాడుతూ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ గణాంకాల ఆధారంగా 2016-17తో పోల్చుకుంటే జిల్లాలో 0.01శాతం ఎయిడ్స్ తగ్గుముఖం పట్టిందన్నారు. ప్రధానంగా వివాహేతర సంబందాలు, అసురక్షితమైన లైంగిక సంబంధాల వల్ల జిల్లాలో 15-49ఏళ్ల వయస్సున్న వారు 90శాతం మంది ఎయిడ్స్‌తో బాధపడుతున్నారన్నారు. గర్భిణీ స్త్రీలు %ఒక్కీఎ% పరీక్షలు చేయించుకున్నవారు 45,802మంది గర్భిణులకు హెచ్ఐవి పరీక్షలు చేయగా, వారిలో 31 మంది పాజిటివ్‌తో ప్రసవాలు జరిగాయన్నారు. 36 మంది హెచ్ఐవి, టిబితో బాధపడుతుండగా, 366 మంది పిల్లల్లో హెచ్ఐవి ఎఆర్‌టి మందులు వాడుతున్నా రన్నారు. డాక్టర్ పూర్ణేంద్రబాబు మాట్లాడుతూ, హెచ్ఐవిలో రాష్ట్రంలో ఆరోస్థానంలో జిల్లా ఉందన్నారు. ఈ సందర్భంగా లూపిన్ ఫార్మా కంపెనీ సమకూర్చిన రూ. లక్ష ఖరీదు చేసే మందులు అందచేసారు. డిఎపిఎల్‌టిఒ బి.నాగేశ్వరరావు, డెమో, శైలజ డిపిఎం సయ్యద్ బేగం, బద్రి, నాగభూషణం పాల్గొన్నారు.

ఓపెన్ స్కూలు పరీక్ష ఫీజు 31లోగా చెల్లింపు

ప్రజాశక్తి - ఆరిలోవ : సార్వత్రికి విద్యాపీఠం ద్వారా 2024లో జరగనున్న పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు వన్స్ ఫెయిల్డ్ విద్యార్థులు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజును డిసెంబరు 31లోగా చెల్లించేందుకు గడువు ఇచ్చినట్టు జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ తెలిపారు. పదోతరగతి విద్యార్థులకు ఒక్కొక్క సబ్జెక్టుకు రూ 100లు, ఇంటర్‌కు రూ 150లు, ఇంటర్ ప్రాక్టికల్స్ ఒక్కొక్క సబ్జెక్టుకు రూ 100లు చెల్లించాలని సూచించారు